చెత్తవేసే ప్రాంతాలపై స్పెషల్ ఫోకస్

- ఇంట్లోని వ్యర్థాలను స్వచ్ఛ ఆటోల్లోనే వేసేలా చర్యలు
- అధికారులకు జోనల్ కమిషనర్ అభిలాష ఆదేశం

సమావేశంలో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ అభిలాష

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 19: కూకట్‌పల్లి జోన్ పరిధిలో తరచుగా చెత్తవేసే (జీవీపీ) ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిని సారించాలని, జీవీపీలన్నింటిని తొలగించేందుకు ప్రత్యేక కార్యచరణతో ముందకు సాగాలని జోనల్ కమిషనర్ అభిలాష తెలిపారు. మంగళవారం జోన్ ఆఫీస్‌లో పారిశుధ్య విభాగం అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్సీ మాట్లాడుతూ.. జోన్ పరిధిలో జీవీపీలను తొలగించేందుకు ఇంటి యజమానులు, కిరాయిదారులకు అవగాహన కల్పించాలని, స్వయం సహాయక బృందాల సహకారాన్ని తీసుకోవాలని, ఇంట్లో వెలువడే వ్యర్థాలను స్వచ్ఛ ఆటోల్లోనే వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జీవీపీల వద్ద ప్రత్యేక నిఘా పెట్టాలని.. చెత్త వేస్తున్న వారిని గుర్తించి వారికి అవగాహన కల్పించాలన్నారు. కాలనీ, బస్తీ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలతో సమావేశాలు నిర్వహించి స్వచ్ఛ ఆటోల్లోనే చెత్త వేయాలని రోడ్లపై చెత్త వేయకుండా చూడాలని కోరారు. గత మూడు నెలల్లో 150 జీవీపీలను తొలగించగా ఇంకా 241 జీవీపీలు తొలగించాల్సిన ఉందని వీటిపై దృష్టిసారించాలన్నారు. పారిశుధ్య కార్మికులు, రాంకీ ఏజెన్సీ ఉద్యోగులతో పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. నిర్మాణ, భవనాల కూల్చివేత వ్యర్థాలను రోడ్లపై వేయకుండా చర్యలు తీసుకోవాలని.. ఎక్కడైనా రోడ్లపైన వ్యర్థాలు వేస్తే ఆ వాహనాలను సీజ్ చేసి కేసు నమోదు చేయాలన్నారు. నిర్దేశించిన ప్రాంతాల్లోనే నిర్మాణ వ్యర్థాలను వేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎం ఉప కమిషనర్ మోహన్‌రెడ్డి, వైద్య అధికారులు సాల్మన్, మమత, భార్గవనారాయణ, చంద్రశేఖర్ రెడ్డి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు, ప్రజలు మంగళవారం శంభీపూర్ కార్యాలయం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం పలువురు తమ ఇండ్లల్లో జరిగే గృహప్రవేశాలు, వివాహాలకు, మల్లన్న జాతర వంటి శుభకార్యాయాలల్లో పాల్గొనలంటూ ఎమ్మెల్సీ రాజుకు ఆహ్వాన పత్రికలను అందజేశారు.
– దుండిగల్, మార్చి 19

బీసీల సమస్యలపై మంత్రికి వినతి

తెలంగాణలోని ఎంబీసీ, డీఎన్‌టీ కులాల సంక్షేమానికి కృషి చేయాలని కోరుతూ రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు జాతీయ ఎంబీసీ, డీఎన్‌టీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బంగారు నర్సింహసాగర్ కోరారు. ఈ మేరకు మంగళవారం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి బీసీ కులాలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. కార్యక్రమంలో నగేశ్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.
– కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 19

వృద్ధుడు అదృశ్యం

దుండిగల్, మార్చి19: కొడుకు వద్దకు వచ్చిన ఓ వృద్ధుడు అదృశ్యమైన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. ఏపీకి చెందిన పీ.సత్యవాణి, ప్రసాద్ దంపతులు గత కొన్నేండ్ల క్రితం నగరానికి వలసవచ్చి కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధి, సుభాశ్‌నగర్ డివిజన్, సూరారం కాలనీలోని శ్రీ సాయి నగర్‌లో స్థిరపడ్డారు. ఇటీవలే ఏపీకి వెళ్లిన ప్రసాద్ దంపతులు పది రోజుల క్రితం తిరిగివస్తూ తన తండ్రి రామారావు(72)ను శ్రీసాయినగర్‌కు తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో ఈనెల 17వ తేదీన ఉదయం టిఫిన్ చేసిన అనంతరం ఇంటిబయట అరుగుపై కూర్చున్నాడు. కొద్దిసేపటి తర్వాత కుటుంబసభ్యులు వచ్చిచూస్తే కనబడ లేదు. దీంతో ఆందోళనకు గురైన వారు రామారావు ఆచూకీకోసం చుట్టుపక్కల వెతికారు. బంధువులు, స్నేహితుల ఇండ్లల్లో ఆరా తీసిన ఫలితం లేకపోవడంతో మంగళవారం సత్యవాణి సూరారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ ప్రతినిధులు

కనీస వసతులు కల్పించాలి

బిల్డర్‌కు భావనాస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధుల విజ్ఞప్తి

దుండిగల్, మార్చి19: మల్లంపేట్‌లోని లక్ష్మీశ్రీనివాస కన్స్‌స్ట్రక్షన్స్ విల్లాల్లో నివాసముంటున్న వారికి కనీస వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. జీఎల్‌సీ వాస్తవ్యుల న్యాయపోరాటం పేరుతో భావనాస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు గత కొన్ని రోజులుగా స్థానిక విల్లాల వద్ద ఆందోళన చేస్తున్న విషయం విధితమే. ఈ నేపథ్యంలో మంగళవారం వారు ఏర్పాటు చేసిన సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. బిల్డర్ నుంచి తాము లగ్జరీ సదుపాయాలు కోరుకోవడం లేదని కనీస వసతులైన తాగునీరు, భూగర్భడ్రైనేజీ, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక బీఆర్ఎస్ నేత ఎంబరి ఆంజనేయులు మాట్లాడుతూ.. బిల్డర్ ఆరోపించినట్లుగా తాను ఎవరి వద్ద నుంచి ఏమి ఆశించలేదని, మధ్యవర్తిగా ఉండి బిల్డర్‌కు 15 ఎకరాల స్థలాన్ని తాము ఇప్పించిన మాట వాస్తవమే స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శామీర్‌పేట్ హన్మంత్‌రావు, భావనాస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీ కొట్టిన కంటైనర్

మూసాపేట, మార్చి19: ముందు వెళ్తున వాహనాన్ని ఓవర్ టేక్ చేసే క్రమంలో ఓ కంటైనర్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొట్టి బీభత్సం సృష్టించిన ఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... మూసాపేట నుంచి కూకట్‌పల్లి వైపు వెళ్తున్న (ఏపీ23వై4233) కంటైనర్ మూసాపేట మెట్రో స్టేషన్ వద్ద ముందు వాహనాన్ని ఓవర్ టేక్ చేయబోయి అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొట్టింది. ఆ సమయంలో అక్కడ ఎటువంటి వాహనాలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ కంటైనర్‌ను వదిలి పరారయ్యాడు. వాహనాదారుల ఫిర్యాదు మేరకు ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు క్రేన్ సాయంతో కంటైనర్‌ను పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. జరిగిన ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కృష్ణమోహన్ తెలిపారు.

మూసాపేట మెట్రోస్టేషన్ వద్ద డివైడర్‌ను ఢీ కొట్టిన కంటైనర్

దేశం బాగుపడాలంటే.. యువత రాజకీయాల్లోకి రావాలి

- ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి
- జేఎన్‌టీయూహెచ్ వర్సిటీ వీసీ కట్టా నర్సింహారెడ్డి

జేఎన్‌టీయూహెచ్‌లో జరిగిన సదస్సులో పాల్గొన్న వీసీ కట్టా నర్సింహారెడ్డి, రెక్టార్ వెంకటేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ వాలంటరీలు, విద్యార్థులు

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 19: యువత చేతుల్లోనే దేశాభివృద్ధి ఉందని చదువుతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో యువత భాగస్థులు కావాలని జేఎన్‌టీయూహెచ్ వర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ కట్టా నర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం వర్సిటీ నేషనల్ సర్వీస్ స్కీమ్ సెల్, నెహ్రూ యువకేంద్ర సంఘటన్ సహకారంతో 'జిల్లా స్థాయి పొరుగు యువత పార్లమెంట్ 2024' అనే సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా వీసీ కట్టా నర్సింహారెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వర్‌రావు, ఎన్‌వైకే స్టేట్ డైరెక్టర్ ఎ.ఆర్.విజయరావు, ప్రిన్సిపాల్ జి.వి.నర్సింహారెడ్డి, టీఐసీయూ జిల్లా ఆఫీసర్ రంగారెడ్డి, ఎన్ఎస్ఎస్ కన్వీనర్ శోభారాణి, కోఆర్డినేటర్ పద్మావతి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువత రాజకీయాల్లోకి రావాలని అప్పుడే దేశం బాగుపడుతుందన్నారు. మనదేశంలో ఉన్న యువ సంపద ఏ దేశానికి లేదని, యువతలో నైపుణ్యాల పెంపు, మహిళా సాధికారత, పేదరిక నిర్మూలన, పౌరవిద్య, పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత, ఆరోగ్యం, విద్య, నాణ్యమైన నాయకులను తయారు చేయడం, అనేక అభివృద్ధి రంగాల్లో నెహ్రూ యువజన కేంద్రాలు పనిచేస్తున్నాయన్నారు. వర్సిటీ పరిధిలో 17 వేల మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఉన్నారని వారందరూ సమాజ సేవా కార్యక్రమాల్లో భాగస్థులవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 19: కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో మంగళవారం కూరగాయల ధరలు (కేజీ–రూపాయలు) క్రింది విధంగా ఉన్నాయి. టమాట 11, వంకాయ 23, బెండకాయ 45, పచ్చిమిర్చి 55, బజ్జి మిర్చి 40, కాకరకాయ 38, బీరకాయ 45, క్యాబేజి 23, ఫ్రెంచ్ బీన్స్ 55, క్యారెట్ 19, కాలీఫ్లవర్ 18, దొండ 23, చిక్కుడు 50, గోరుచిక్కుడు 40, బీట్‌రూట్ 17, క్యాప్సికం 65, ఆలుగడ్డ 21, కీరా 23, దోసకాయ 18, సొరకాయ 9, పొట్లకాయ (1) 15, కందగడ్డ 60, ఉల్లిపొరక 35, ఉల్లిగడ్డ 22, మామిడికాయ(1) 10 నుంచి 15, అరటికాయ(1) 8 నుంచి 9, చామగడ్డ 45, ముళ్లంగి (1) 4 నుంచి 6, మొరంగడ్డ 18, గుమ్మడికాయ 18, నిమ్మకాయలు(12) 55 నుంచి 60, మునగకాయ(1) 5 నుంచి 6, పచ్చి బఠాని 50, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు (200గ్రా.) 40, ఎండుమిర్చి 220, అల్లం 160, వెల్లుల్లి 180, చింతపండు 140, కరివేపాకు 80గా ఉన్నాయి. ఈ ధరలు బుధవారం ఉదయం 9:30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ వెల్లడించారు.

షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధం

కొండాపూర్, మార్చి 19: షార్ట్ సర్క్యూట్‌తో ఓ కారు దగ్ధమైన ఘటన చందానగర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం... గచ్చిబౌలి వైపు నుంచి నల్లగండ్ల వైపు వెళ్తున్న కారు (ఏపీ39ఎన్‌బీ3011) గుల్‌మోహర్ పార్కు సిగ్నల్ సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ పంపు దగ్గరకు వస్తున్న క్రమంలో షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా ఆగిపోయింది. రోడ్డు మధ్యలో ఆగిపోతుందన్న కారణంతో కారును పెట్రోల్ పంపు వైపునకు తిప్పగా, కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన పెట్రోల్ పంపు సిబ్బంది మంటలు అదుపు చేసేందుకు ప్రయత్నించారు. అదే సమయంలో అటుగా వెళ్తున్న క్రేన్ సాయంతో కారును అక్కడి నుంచి కొద్ది దూరానికి తరలించడంతో పెను ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న పటాన్‌చెరువు ఫైర్ స్టేషన్ అధికారులు ఘటన స్థలానికి చేరుకుని మంటలు ఆర్పివేశారు.

కారులో చెలరేగుతున్న మంటలు

మోదీని కలవడం అదృష్టంగా భావిస్తున్నా

ప్రధానమంత్రి నరేంద్రమోదీని కలవడం అదృష్టంగా భావిస్తున్నానని బాలాజీనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు జి.వినోద్‌కుమార్ గౌడ్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా తెలంగాణ రాష్ట్రానికి విచ్చేసిన నరేంద్రమోదీకి డివిజన్ అధ్యక్షుడు వినోద్‌కుమార్ గౌడ్ ఘన స్వాగతం పలికాడు. బీజేపీలో సామాన్య కార్యకర్తలకు సైతం గుర్తింపు లభిస్తుందనడానికి ఈ ఉదాంతం మరోసారి రుజువు చేసిందన్నారు.
– కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 19

జిల్లా దవాఖానలో ఉచిత వైద్య పరీక్షలు

కొండాపూర్, మార్చి 19: కొండాపూర్‌లోని రంగారెడ్డి జిల్లా దవాఖానలో ఉచిత వైద్య పరీక్షలు కొనసాగుతున్నాయని దవాఖాన సూపరిండెంట్ డాక్టర్ అనురాగిణిరెడ్డి తెలిపారు. కార్పొరేట్‌కు ధీటుగా వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు ప్రైవేట్ దవాఖానలకు వెళ్లి డబ్బులు వృథా చేసుకోకుండా ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉచిత వైద్య పరీక్షల్లో భాగంగా మంగళవారం 1040 పరీక్షలను నిర్వహించినట్లు ఆమె వెల్లడించారు.

నియామక పత్రం అందజేత

బాలానగర్, మార్చి 19: ఫతేనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ అధ్యక్షుడిగా ఎండీ జహంగీర్ నియమితులయ్యారు. కాంగ్రెస్ మైనార్టీ సీనియర్ నాయకుడు ఇమ్రాన్ కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని పలు డివిజన్ల మైనార్టీ అధ్యక్షులను ఆయన నియమించారు. ఈ మేరకు మంగళవారం ఫతేనగర్ డివిజన్ కాంగ్రెస్ మైనార్టీ అధ్యక్షుడిగా ఎండీ జహంగీర్‌ను నియమించి, నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జహంగీర్ మాట్లాడుతూ.. తన సేవలను గుర్తించి డివిజన్ మైనార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించడంతో తనపై మరింత బాధ్యత పెరిగిందని, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

ఎన్నికల విధులను పకడ్బందీగా చేపట్టాలి

- కుత్బుల్లాపూర్ అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సైదులు

సర్కిల్ కార్యాలయంలో పోలీస్, ఎన్నికల సెక్టోరల్ అధికారులతో మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి సైదులు

కుత్బుల్లాపూర్, మార్చి 19: కేంద్ర ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశాల మేరకు ఎన్నికల విధులను పటిష్టాత్మకంగా చేపట్టేందుకు అధికారులు, పోలీసులు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పులి సైదులు సూచించారు. మంగళవారం కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన అధికారులు, పోలీస్ సెక్టోరల్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఎన్నికలను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశాల మేరకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. చెక్‌పోస్టులు, ఇతర వాహనాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూనే రూ.50 వేలకు పైగా నగదు, ఇతర ఓటర్లను ప్రభావితం చేసే సామగ్రిని సీజ్ చేయాలన్నారు. సీ–విజిల్‌లో వచ్చిన ఫిర్యాదులను వెనువెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఈఆర్‌ఓలు, ఏఆర్‌ఓలు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

దుండిగల్, మార్చి19: కుళ్లిపోయిన స్థితిలో ఓ వ్యక్తి మృతదేహం లభించిన ఘటన మంగళవారం సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం... సూరారం డివిజన్ పరిధి, శ్రీకృష్ణానగర్ వెనుకవైపు ఉన్న అటవీప్రాంతం అర్బన్‌ఫారెస్ట్‌లో గుర్తుతెలియని ఓ వ్యక్తి మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభించకపోగా శవం కుళ్లి నస్థితికి చేరుకుందని, మృతుడి వయస్సు 40–45 ఏండ్ల మధ్యన ఉండవచ్చని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకొని ఆత్మహత్య

కుత్బుల్లాపూర్, మార్చి19: మద్యానికి బానిస కావడంతో కుటుంబంలో తలెత్తిన గొడవలతో ఓ వ్యక్తి మనస్తాపం చెంది ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మంగళవారం జగద్గిరిగుట్ట పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. జగద్గిరిగుట్ట దీనబంధు కాలనీకి చెందిన పోలా సందీప్ (30) దంపతులకు ఓ కూతురు. రోజువారీ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ మధ్య కాలంలో సందీప్ మద్యానికి బానిసయ్యాడు. అప్పటి నుంచి ఇంట్లో భార్యాభర్తల మధ్య అప్పుడప్పుడు గొడవలు జరుగుతున్నాయి. సోమవారం కూతురు పుట్టిన రోజున కూడా తాగి అతడు ఇంటికి రావడంతో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. కూతురుని తీసుకొని భార్య బయటకు వెళ్లి.. తిరిగి సాయంత్రం సమయంలో ఇంటికి వచ్చి చూడగా.. ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని చనిపోయి ఉన్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

సమావేశంలో మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ఇ.చెన్నారావు

పెరిగిన ఇసుక ధరలు తగ్గించాలి

కుత్బుల్లాపూర్, మార్చి19: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇసుక రేట్లను పెంచడంతో దానిపై ఆధారపడిన కార్మికులు ప్రత్యేక్షంగా, పరోక్షంగా ఉపాధిపై పెనుభారంగా మారిందని, పెంచిన ఇసుకరేట్లను తగ్గించాలని తెలంగాణ రాష్ట్ర భవన, ఇతర నిర్మాణ రంగాల కార్మికుల ట్రేడ్ యూనియన్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ఇ.చెన్నారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మంగళవారం జీడిమెట్లలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇసుక ధర భారీగా పెరిగిందని, జనవరిలో టన్ను ఇసుకకు రూ. 1,500 ఉండగా ప్రస్తుతం రూ.3 వేలకు పెంచడంతో పేద, బలహీన, మధ్యతరగతి కుటుంబాలు నిర్మాణాలు నిలిపివేసుకున్నారని ఆరోపించారు. ఇసుకపై పెంచిన ధరలను ప్రభుత్వం వెంటనే తగ్గించాలని లేనిపక్షంలో రాబోయే రోజుల్లో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేతకానిలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

ఖైరతాబాద్, మార్చి 19: రాష్ట్ర వ్యాప్తంగా అనేక సామాజిక వర్గాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ నేతకాని వర్గాలను విస్మరించిందని నేతకాని మహర్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేశ్ ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సామాజికవర్గాలను కలిపి 37 మంది వివిధ కార్పొరేషన్లకు చైర్మన్ పదవులు సైతం కేటాయించింది, కాని 20 లక్షల జనాభా కలిగి ఉన్న ఎస్సీ నేతకానిలకు కనీసం గుర్తింపు ఇవ్వలేదు. నామినేషన్ పదవులు కేటాయించలేదు. ఇప్పటికై నా నేతకానిలకు గుర్తింపు ఇవ్వకపోతే పార్లమెంట్ ఎన్నికల్లో 20 లక్షల మంది జనాభా కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఓట్లు వేస్తారని ఆయన హెచ్చరించారు.

జూబ్లీహిల్స్ అపోలో ఆస్పత్రిలో ఆవరణలో కొలువుదీరిన ఆమోదగిరి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం 36వ వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం నిత్య హోమం, అభిషేకం, పల్లకీ సేవ తదితర పూజా కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అపోలో గ్రూప్ చైర్మన్ డా. ప్రతాప్ సి రెడ్డి దంపతులు, వైస్ చైర్ పర్సన్ ప్రీతారెడ్డి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డా. సంగీతారెడ్డితో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.
– బంజారాహిల్స్, మార్చి 19

ఎండల్లో హాయ్.. హాయ్: గండిపేట చెరువు.. ఆ పక్కన ఉద్యానవనం.. ఇంకేముంది పర్యాటకులను ఆకర్షిస్తున్నది. మండువేసవిలో కూడా గండిపేట చెరువు నీళ్లతో కళకళలాడుతున్నది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో చెరువు పక్కన ఏర్పాటు చేసిన పార్కు పర్యాటకులను ఆకట్టుకుంటున్నది. దానిలో భాగంగా మంగళవారం ఇలా సేద తీరుతూ.. ఫొటోలు దిగుతూ ఆనందంలో పరవశించిపోతున్నారు.

యూసుఫ్‌గూడలో ప్రత్యేక బృందాలతో కలిసి ఆస్తిపన్ను వసూలు చేస్తున్న ఏఎంనీలు

ఆస్తిపన్ను వసూలు వేగిరం

రెండు రోజుల్లో రూ.65 లక్షల పాత బకాయిలు వసూలు

జూబ్లీహిల్స్,మార్చి19: ఆస్తిపన్ను వసూలుకు అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నారు. ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లింపులకు మార్చి 31తో గడువు ముగియనుండడంతో ఆస్తిపన్ను వసూలును వేగిరం చేస్తున్నారు. యూసుఫ్‌గూడ సర్కిల్‌లో సోమవారం రూ. 35 లక్షలు, మంగళవారం రూ.30 లక్షలు చెక్‌లను పాత బకాయీదారుల నుంచి వసూలు చేశారు. ఆస్తిపన్ను వసూలుకు వన్ టైమ్ సెటిల్‌మెంట్ ఆఫర్‌ను అందిస్తున్న అధికారులు పాత బకాయీలపై ప్రధానంగా దృష్టి పెడుతున్నారు. ఎరియర్స్‌పై 90 శాతం వడ్డీ మాఫీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని విస్తృతంగా ప్రచారం చేపడుతున్నారు. యూసుఫ్‌గూడ, రహ్మత్‌నగర్, వెంగళరావు నగర్, బోరబండ, ఎర్రగడ్డ డివిజన్‌లలో బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లతో పాటు జీహెచ్ ఎంసీ ప్రత్యేక బృందాలు ఆస్తిపన్ను వసూలు చేపడుతున్నారు. యూసుఫ్‌గూడ సర్కిల్‌లో ఆయా బృందాలతో ఏఎంనీ కమల్, ఇన్‌చార్జి ఏఎంనీ బాల్‌రాజ్ ఆస్తిపన్ను వసూలు చేస్తున్నారు. ఈ ఏడాది రూ.33.73 కోట్ల ఆస్తిపన్ను వసూలు లక్ష్యంతో అధికారులు ముందుకెళ్తున్నారు.